# అబ్బే, కొసమెరుపు కథ!

**ఉపోద్ఘాతం:–** కుప్పలు తిప్పలుగా ఆంధ్రదేశంపైకి విరుచుకుపడి. .. ... ప్రజలకు హత్యలపైనా, చౌర్యంపైనా దృష్టిమరలించిన డిటెక్టివ్ నవలలసర్వస్వాన్ని చదివిపారేసిన యువకులలో ముఖ్యంగా పేర్కొనాలి ముకుందాన్ని. ముకుందం ఈమధ్య తెలుచు భోజనం మానేస్తున్నాడు. అరగంట భోజనానికాలస్యమైతే అరిచి మూర్ఛపోయే అలవాటుగల ముకుందం ఎలా వుండగలుగుతున్నాడో అతని తల్లికి తెలియలేదు. ఆమెకి డిటెక్టివ్ నవలల రుచి తెలియదు మరి! ముకుందానికి ఈ నవలలు తెగ చదవడంతో ఎక్కడైనా పిల్లిఅరిచినా స్త్రీఆర్తనాదంగానూ-జంక్షన్లో ఏ వ్యక్తి నిలబడి దీర్ఘాలోచనలో వున్నా అతనొక డిటెక్టివ్ గానూ-సినారేకు డబ్బాలు పట్టుకెళ్తూంటే అందులో కళేబరాన్ని ఉంచినట్టూ ఊహాలు వస్తున్నాయి. అతనిగదిలో షెల్ఫులూ బట్టల బీరువాలూ కూడా ఈ హత్యాసాహిత్యంతోటే నిండిపోయాయి. బయటి ప్రపంచానికి భిన్నమైన ఒక డిటెక్టివ్ ప్రపంచమే అతనికి కనుపిస్తోంది. అయితే ఇవి చదవడంవల్ల బుద్ధి వికసిస్తోందనే నమ్మకం కుదిరింది. క్రమంగా ఈనవలల విషయంలో అతనికి విమర్శనాదృష్టి వచ్చింది. "అబ్బే చప్పగావుంది", "ఇంత వల్గర్ గా వుందేం భాష", "భీకరశ్రీ రచనలు బాగుండవు", "అంతా ఇదే టెక్నిక్ లో రాస్తారేం" మొదలైన అభిప్రాయాలు చాలాసార్లు రావడంతో డిటెక్టివుల్లో సరుకే తక్కువైందో తనలో విమర్శనజ్ఞానం హెచ్చిందో ఊహించలేకపోయాడు. సహజంగా ముకుందం కొంత భయస్థుడైనా చురుకుగా ఏ విషయమైనా పసిగట్టి అనుమానించడం అతని ప్రత్యేకత. నిత్యవ్యవహారంలో ఆఫీసులో ఒకటి రెండు రహస్యాలను అద్భుతంగా భేదించడమే ఇందుకు నిదర్శనం.

రోజుకు రెండో మూడో కొత్తనవలలు దిగేటప్పుడు అవి చదవందే తెల్లవారనిచ్చేవాడుకాదు ముకుందం. రెండురోజులైంది ఏమీ దిగకపోవడం వల్ల బుఱ్ఱ ఖాళీఅయిపోయి బాధపడి పోతున్నాడు.

రెండునెలలై సినీమాకి వెళ్ళలేదని జ్ఞాపకం వచ్చింది. జేబులో రూపాయివుంది భోంచేసి సెకండ్ షోకి థియేటర్ కి బయలుదేరాడు. అందులో ఆడుతున్న సినిమా "డిటెక్షన్".

ఈ మధ్య చాలా రోజులైంది అనుకుంటున్నాడు – ఒక డిటెక్టివ్ నవల వ్రాసి ఆంధ్ర భాషా యోషకొక భూషగా అర్పిద్దామని. చాలా నవలలు చదివి అన్నిటిలోంచి 'సహృదయంతో కొన్ని భావాలు స్వీకరించి' ఒక కొత్తపంథాలో కథ నడిపించాలని అతని ఊహ. ఈ పిక్చర్ కి వెళ్ళడమూ అందుకే! చూశాడు. కాని 'కొత్త' యేమీ కనుపించలేదు. తిరిగి వస్తున్నాడు. అతనికి తనే నాయకుడుగా ఒకప్లాటు అనుభవంలోకి రావడం ఆరభించింది. ఆ ఇతివృత్తం ఇది

**పరిచయం:–** అంధకారం ఆవరించింది.

నిర్జనంగావున్న ఆ. .. .. యిరుకువీధి మధ్యనుంచి నేల మట్టానికి రెండడుగుల యెత్తులో ఎఱ్ఱని నిప్పుకణం ఒకటి ముందుకువస్తూంది-వెనక్కా

**కన్నసామి**

ముంగుతూ ఊగుతూను రెండునిమిషాల కొకమారు సుమారు 5½ అడుగులకుపైగా లేచి అక్కడ ఎఱ్ఱగా వెలిగి మళ్ళా ఎప్పటి లెవెల్లోకి దిగుతూంది. పాఠకులారా! చూడండి. ఆ నిప్పురవ్వతోనే మనంకూడా యీ సందు మలుపు తిరుగుదాం. ఆ వెలుగురవ్వ ఈసారి పైకివెళ్ళి ఎఱ్ఱగా అయి తన వెనుకనున్న ఆ–ఏమిటది–ఒక, మానవ–అవును–ముకుందమే–అతని ముఖాన్ని కనబరుస్తోంది. సిగరెట్టు పొట్టిదైతే ఓ పక్కకి విసిరేశాడు ముకుందం. రెండడుగులు వేసి స్టన్ ఐపోయాడు ముకుందం.

**పరిశోధన:–** ముకుందం విసరిన చిన్న సిగరెట్ పీకె పక్క కాలువలోకి...దొర్లిపోయింది. అదిఅతను ఖచ్చితంగాచూశాడు కాని ఇదేమిటి ఇక్కడ మరొక సిగరెట్ పొడుగావున్నది పడివుంది! రెండు పఫ్ లయాక పడేసినట్టు కనిపిస్తోంది; రోడ్డుకు కొంచెం పక్కగా వెలుగుతూంది. తనముందు ఎవరూ ఆ సందులోనుంచివెడుతున్నట్టుచూడలేదే! ఇదిక్కడికెలా వచ్చింది?—అసలు ముకుందానికి సిగరెట్ పీకలమీద డిటెక్షనంటే-అది పాత టెక్నిక్ అని అభిప్రాయం. కాని ప్రస్తుతం తప్పనిసరిగా అదే చేయాలనిపించింది. ఆ సిగరెట్ ఎత్తి పట్టుకున్నాడు అసహ్యించుకుంటూ జేబులో అగ్గిపెట్టెతీసి వెలిగించి పరీక్షించాడు. అది పూర్తిగా తక్కువరకం సిగరెట్టు. అందుచేత ఈ సిగరెట్ ను కాల్చినవాడు పోగ్గా వుందామనుకునే పేద అని నిర్ణయించవచ్చు. ఇంత తక్కువరకం సిగరెటు పీల్చకుండావున్న అయిదు నిమిషాల్లోనే ఆరిపోతుంది కాబట్టి-ఇంకా వెలుగుతూందంటే ఇప్పుడే ఆ వ్యక్తి వెళ్ళాడన్నమాట! ఇంత పొడవైన సందులో అతడైనా తన కెదురుపడాలన్నది నిశ్చయం! కనుక తనకు ముందే వెళ్ళిఉండాలి ఇంత అర్ధరాత్రప్పుడు అందరూ ధనికులే వుండే ఈ సందులోనుంచి ఆ"విలన్"ఎందుకు వెళ్ళాలి! ఏదో దురుద్దేశం ఉందనే నమ్మాడు ముకుందం. ఆ వెళ్ళిన వ్యక్తి ఉద్దేశాన్నిగురించి మరొక ఐడియా వచ్చింది 'ఈ తక్కువరకం మనుష్యులు సిగరెట్టు ముట్టిస్తే సెంటిమీటరు పొట్టిదయేవఱకూ వదలగలరా! రెండు పఫ్ లేనా కాకుండా ఈ విలన్ పారేశాడంటే ఏదో కారణం ఉండాలి అతని దురుద్దేశాన్ని అమలో పెట్టడానికి ఇక్కడే నాంది జరిగి వుండాలి. ఏ అమ్మాయో కనిపిస్తే హఠాత్తుగా సిగరెట్ పారేసి వెంబడించవచ్చు. లేదా ఈ ప్రాంతంలో యింట్లోనే దిగివుండాలి. ముకుందం ఆ అభిప్రాయాన్ని బలపర్చుకొని గబగబ ముందుకుసాగాడు. కొంతదూరం వెళ్ళాక ఆ సందు చివరను ఎడమపక్కకు రెండు ఆకారాలు మళ్ళినట్టు అనుమానించాడు ముకుందం

**సస్పెన్సు:–** అయితే విలన్ లిద్దరన్నమాట! వాళ్ళు మళ్ళడం హీరో (ముకుందాని)కి ఉపయోగించిరది. పిల్లిఅడుగులతో చిన్న పరుగు పెట్టాడు ముందుకు. ముకుందం ఆంతర్యంలో మరొక చిన్న భయం ఉంది. ఆ సందుమలుపు తిరిగినవెంటనే ఉన్నది-వనిక. యిల్లు! ఆ అమ్మాయీ, తనూ ఒక ఆఫీసులోనే పని చేస్తున్నారు. ఆమెమీద చాలా వాదులు ప్రచారంలో వున్నాయి ఆమె పేరుమీదుగా ఆఫీసులో కొందరికి రెండుమూడు సార్లు వార్నింగ్ లు వచ్చాయి. అయితేనేం ఆమె చాలా అందంగా వుంటుంది. కాబట్టే

కవిగుమాస్తా ఒకడు వన్నెల విసనకర్ర (వ. వి. క) అన్నాడు. అప్పట్నుంచీ అందరికీ వ. వి. క! ఆమెసంగతి పరువు తెరల వెనుక నుంచి బజార్లోపడిన దగ్గర్నుంచీ వీధుల్లోనే కొందరేదో వాగేవారు ఆమెనిచూసి పక్కనుంచి వెళ్తూ సకిలించేవారు వీళ్లిద్దరు విలన్లూ అక్కడికి వెళ్లి ఏమీ ప్రమాదం తేరుకద! అనుకున్నాడు అయినా అంత సంఘటనే జరిగినప్పుడు — నవలకు ఒక వాస్తవికమైన ప్లాట్ సంపాదించిన ఆ అదృష్టంలో— ఈవిచారం ఏమాత్రం?—సమాధానపరచుకొన్నాడు. సందుచివరకొచ్చాడు దురదృష్టవశాత్తూ ముకుందం ఊహించినట్టే ఆరెండు మానవాకారాలూ చీకటిలో వ. వి. క. యింటిదగ్గరే గోడదగ్గర నిలబడ్డాయి "అయ్యో" అనుకున్నాడు హీరో ఒక్క అడుగు ముందుకు వేస్తే ఏమాతుందోనని భయపడ్డాడు ముకుందం. సందుచివరనున్న ఒకయింటి తలుపుకన్నంలోంచి వచ్చిన వెలుగు ఒకగీతలా రోడ్డుమీద పడివుంది దాటితే కనబడిపోతానేమోనని వెనక్కితగ్గి నిల్చున్నాడు. అందులో ఒకడు మెల్లగా ఏదో చెబుతున్నాడు రెండవవాడు ఏదో సాధనంమీద—అది పెద్దమోకుగాని నిచ్చెనగాని అవొచ్చు—ఆడాబామీద ఓపక్కనుంచే గదికిటికీదగ్గరకి ఎక్కుతున్నట్టు అర్థమైంది ముకుందానికి తప్పదు! ఈహత్య తప్పదు!! దీనికిముందు సంఘటనలు కొన్ని కల్పించాల్సివుంటుంది కల్పించి, పాకెట్ సైజు అర్ధరూపాయి నవలగా తయారుచేయాలి పేరేంపెడితే బాగుంటుందీ!? విలన్లపేర్లా? ఊహూ—తనపేరే! అబ్బేబ్బే—బాగా అమ్ముడవాలంటే ఆడపేరూ, ఆడబొమ్మ, ఆడహత్యా కలియాలి మరొక విషయం--సాధ్యమైనంత పెద్దపేర్లు పెట్టడమే ఫేషన్ గావుంది

"అర్థరాత్రి అబలపై అఘాయిత్యం".. ప్చ్! చాలదు కనీసం రెండు లైనులురావాలి రా "నిశివేళ నిద్రలో నీరజాక్షిని నిహతుల్ని చేసిననిర్దయుడు". రైట్ రైట్ తు! అదేఖాయం—మళ్లా మరొక మాంఛి, పెద్ద గొప్పపేరు దొరికేవరకూను.

"జాగ్రత్తగా పట్టుకోరా" మెల్లగా అన్నాడు పైకెక్కనవాడు ముద్దమాటల్తో

ముకుందానికంతా అగమ్యం అయిపోయింది పైనుంచి అరుపైనా వినబడకుండా నొక్కేశాడా! లేక సొమ్ములు దొంగిలించి దిగిపోయాడా!?

క్లయిమాక్స్:—ఇక నీ విషయానికి బలవత్తరమైన సంఘటనలు తటస్థిస్తాయని ఊహించాడు ముకుందం. అలా ఊహించడానికి కారణం—ఇందులో పాల్గొని అలా తటస్థింపజెయ్యాలని నిశ్చయించుకున్నాడు కనుక. కాని ముందుకు వెళ్ళేసాహసం లేకపోయింది. పైనుంచి మానవాకారం దిగిపోయింది. రెండో వ్యక్తితో కలసి ఆ సందంటే మెయిన్‌రోడ్డువైపు వెళ్లిపోతున్నాడు విలన్ ముకుందం ఆత్రుతగా ఆయింటిగోడదగ్గరకువెళ్లి ఏమైనా ఆచూకీ దొరుకుతుందేమోనని అగ్గిపుల్ల వెలిగించాడు భయంకరమైనదృశ్యం కంటబడింది ముకుందానికి. ఆగదిగోడ పైనుంచి కిందవరకూ ఒకేఎఱ్ఱని జీరలవరుస. ఒకజీరతో మరొకజీరకలసి కిందకిచేరుకుంటోంది రక్తం చూసి భరించలేకపోయాడు. తలయెత్తి అటు చూసేసరికి యిద్దరిలోనూ ఒకడుతనకుడిచేత్తో నడుముకొనించుకొని పెద్దఆకారాన్ని పట్టుకొని నడుస్తున్నాడు పాపం! వ. వి. క. శవాన్నికూడా తీసుకుపోతున్నారే! ముకుందానికి వంట్లో బలంలేకపోయినా శౌర్యం ఉప్పొంగింది వాళ్ళవెంటే మెయిన్‌రోడ్ చేరి కేకలేద్దామని నిశ్చయించుకున్నాడు. ఏం సాహసం-వాళ్లు మెయిన్‌రోడ్డు కిల్లీకొట్ల వెలుగుల్లోకి చేరిపోయారు. ముకుందం ఒక్కపరుగులో మెయిన్‌రోడ్ చేరుకున్నాడు అప్పటికే వాళ్ళొక గోడ ఒడ్డుకు చేరుకున్నారు. ఒకడు గోడకునిచ్చెన ఆనించాడు రెండోవాడు ఎక్కాడు. కిందవాడు ఒక పెద్దకాగితం అందించాడు. పైవాడు అది గోడకంటించాడు ఆ వాల్ పోస్టర్ మీదవున్న అక్షరాలు చదివాడు ముకుందం. "డిటెక్షన్." పైన అంటించినవాడు కిల్లీనముల్తూ ఉమ్మివేశాడు పైనించే. గోడంట ఎఱ్ఱనిజీరలు జారిపోతున్నాయి. కిందనున్నవాడు పూర్తి తక్కువరకం సిగరెట్టు ముట్టించాడు. కిందకిదింపిన పెద్ద ఆకారం—వాల్ పోస్టర్లకట్టని కుడిచేత్తో నడుముకానించుకున్నాడు ముకుందం మూర్ఛపోలేదు గాని "క్లయిమాక్స్ రాలేదు అబ్బే! కొసమెఱుపుకథ" అనుకున్నాడు ★

